క్లుప్తంగా

ఘనంగా ఆర్యవైశ్యుల వనసమారాధన


వనసమారాధనలో పాల్గొన్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే తాతయ్య

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ఆర్యవైశ్యులు వనసమారాధన కార్యక్రమం స్థానిక మామిడి తోటలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాతకు పూజలు చేసి ఆట,పాటలతో సందడి చేశారు. ఈనేపథ్యాన ఆర్యవైశ్యులు చేస్తున్న సేవలకు కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు సిల్వర్, గోల్డ్ మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ తాతయ్య, సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, గవర్నర్ గుమ్మడివెల్లి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగుబండి శ్రీనివాస రావు, కనమర్లపూడి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు ఆటల పోటీలు


కబడ్డీ ఆడుతున్న వసతిగృహ విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ సంక్షేమ శాఖ వసతి గృహ విద్యార్థులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. వసతిగృహ స్థాయి ఆటల పోటీలను ఆయా వసతిగృహాల సంక్షేమ అధికారులు నిర్వహించారు. ఈనేపథ్యాన ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించే పోటీలకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. నయాబజార్‌లో బీసీ కళాశాల బాలుర వసతిగృహ (పాలేరు) విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీసీడీఓ ఎం.ఈదయ్య, వసతిగృహ సంక్షేమ అధికారి నెల్లూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో ఓ కోతి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆదివారం స్థానిక యువకులు వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు.

సీహెచ్‌సీకి రూ.50వేల మందులు వితరణ


వైద్యులకు మందులు అందిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: స్థానిక సీహెచ్‌సీకి పట్టణంలో పెట్రోల్‌బంక్, హోటల్, తదితర చోట్ల కూలీ పనులు చేయడంతో పాటు దాతల నుంచి సేకరించిన రూ.50 వేల విలువైన అత్యవసర మందులను ఆమ్ ఆద్మీ పార్టీ పాలేరు ఇన్‌చార్జ్ పసుమర్తి శ్రీనివాస్ ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు నల్లమోతు తిరుమలరావు మాట్లాడుతూ.. సామాన్యులకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యాన్ని అందిస్తున్న ఢిల్లీ ప్రభుత్వం తరహాలోనే రాష్ట్రంలో సేవలు అందించాలని కోరారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మందుల కొరత కారణంగా ఈ వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వర్ణ సుబ్బారావు, సూర్యదేవర సంగమేశ్వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	36	బచ్చలికూర	3
వంకాయ	58		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	44		20
కాకర	28	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	38	తోటకూర	3
దొండ	30		20
పొట్లకాయ	50	గోంగూర	5
చిక్కుడు	74		20
గోరుచిక్కుడు	54	మెంతికూర	2
క్యాబేజీ	44		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		40
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	78		25
క్యాప్సికం	88	-ఖమ్మం వ్యవసాయం	

సర్వే సా..గుతోంది!


మేయర్ పునుకొల్లు నీరజ ఇంటికి స్టిక్కర్ వేస్తున్న ఎన్యూమరేటర్లు

కేఎంసీలో పూర్తి కాని హౌస్ లిస్టింగ్ ప్రక్రియ

- ఇంకా మొదటి దశలోనే సర్వే
- పెరిగిన ఎన్యూమరేటర్ల బ్లాక్‌లు
- ఎన్యూమరేటర్ల గైర్హాజరుతో జాప్యం
- రెండో దశకు మరో రెండు రోజులు..

కేఎంసీ హౌస్ లిస్టింగ్ వివరాలు..

మొత్తం ఇళ్ల సంఖ్య	1,68,875
మొత్తం ఈబీలు	965
ఆదివారం స్టిక్కరింగ్ అయిన ఇళ్లు	61,543
పూర్తయినవి	1,53,085

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రక్రియ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కొంత ఆలస్యంగా కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో సర్వేకు సంబంధించిన మొదటి దశ (హౌస్ లిస్టింగ్ కార్యక్రమం) పూర్తయి, రెండో దశలోని కుటుంబసభ్యుల వివరాలు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. కానీ ఖమ్మంలో మాత్రం ఈ ప్రక్రియ ఇంకా మొదటి దశలోనే ఉంది. ఆదివారం కూడా హౌస్ లిస్టింగ్ ఇంటింటికి స్టిక్కరింగ్ కార్యక్రమమే కొనసాగగాఇంకా పలు ప్రాంతాల్లో ఇళ్లకు స్టిక్కరింగ్ వేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని అధికారులు పేర్కొంటుండగా.. సర్వేకు ఎన్యూమరేటర్ల గైర్హాజరుతో మరింత జాప్యం జరుగుతుందని తెలుస్తోంది.

పెరుగుతున్న ఈబీలు..

కేఎంసీలో మొత్తం 965 ఎన్యూమరేటర్ బ్లాక్ (ఈబీ)ల్లో హౌస్ లిస్టింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా.. అధికారుల అంచనా కన్నా అదనంగా మరో 50కి పైగా ఈబీలు పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. సోమవారం సాయంత్రం కల్లా మొత్తం ఈబీల సంఖ్య తెలుస్తుందని, దానికి అనుగుణంగా ఎన్యూమరేటర్లను కేటాయించనున్నట్లు తెలుస్తోంది.

సర్వేలో జాప్యం..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను రెండు దశల్లో చేపట్టారు. మొదటి దశలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియగా, రెండో దశలో కుటుంబం వివరాల నమోదుగా నిర్ణయించారు. అయితే జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఈ నెల 8వ తేదీ నాటికే మొదటి దశ పూర్తయి రెండో దశ సర్వే ప్రారంభం కాగా.. కేఎంసీలో మాత్రం ఇంకా మొదటి దశలోనే ఉంది. మంగళవారం నుంచి రెండో దశ సర్వే ప్రారంభం అవుతుందని అధికారికవర్గాలు పేర్కొంటున్నాయి. ఈమేరకు రెండో దశ ప్రక్రియకు నేడు(సోమవారం) ఎన్యూమరేటర్లకు డీపీఆర్‌సీ భవనంలో శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక సర్వే వివరాలను నమోదు చేసే ఫారాలు కేఎంసీకి ఇంకా చేరలేదని అవి వస్తేనే కుటుంబల వివరాలు నమోదు చేసేందుకు వీలుంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

క్రమపద్ధతిలో నిర్వహించాలి..


బర్లగూడెంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కామేపల్లి: ఇళ్లకు స్టిక్కరింగ్ ఏ పద్ధతిలో వేశారో అదే తరహాలో సర్వే చేయాలని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. ఆదివారం మండలంలోని బర్లగూడెం, జోగ్గూడెం తదితర గ్రామాల్లో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించాక ఆయన మాట్లాడారు. ఒక ఎన్యూమరేటర్‌కు ఎన్ని ఇళ్లు కేటాయించారో వాటిని పక్కాగా సర్వే చేయాలన్నారు. ఇచ్చిన అంశాలను జాగ్రత్తగా చదివి వినిపించి కుటుంబ యజమాని తెలిపిన వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు.

సర్వేకు సహకరించాలి


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సిలార్‌సాహెబ్

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం, పిండిప్రోలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కుటుంబ సర్వే నిర్వహణ తీరును తెలుసుకుని కుటుంబ వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని తెలిపారు. ప్రజలు అధికారులు అడిగిన అన్ని వివరాలను తెలిపి సహకరించాలని కోరారు.

సర్వేపై విస్తృత ప్రచారం..


ప్రచారం చేస్తున్న నాయకులు

నేలకొండపల్లి: మండలంలోని ముజ్జుగూడెంలో సమగ్ర సర్వేపై పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకుడు వేగినాటి లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యాన నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సర్వేకు సహకరిస్తూ ఇళ్లకు వెళ్లి ప్రజలను చైతన్యం చేసి సర్వేకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొమ్మూరి నరేష్, ఉండమోదుగుల శ్రీనివాసరావు, తన్నీరు నారాయణ, రేగళ్ల సురేష్, రేగళ్ల నాగేందర్, బొడ్డు శ్రీను, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్ల అ‘పూర్వ’ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: నేలకొండపల్లి మండలం బోదులబండ జెడ్పీఎస్ఎస్ పదో తరగతి(1975-76వ బ్యాచ్) పూర్వ విద్యార్థులు నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు టి.వెంకట్రావు, శివరామకృష్ణ ప్రసాద్, వెంకటరెడ్డి, యల్లయ్య, ఎల్‌వీ రెడ్డి, భాస్కర్‌రావు, వెంకటేశ్వరరావు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 15న ఖమ్మం ఒయాసిస్ రిసార్ట్‌లో జరిగే మాల, మాల ఉపకులాల ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన్ని జయప్రదం చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా మాల మహానాడు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ గుంతేటి వీరభద్రం కోరారు. ఆదివారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన వివరించారు. ఈ సమావేశంలో గౌరవ సలహాదారుడు లింగాల రవికుమార్, బాబూరావు, ముడుసు జాకోబ్‌ప్రతాప్, దయానంద్, దామళ్ల సత్యం, కనకరాజు, చిరంజీవి, మల్లయ్య, యోనా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం సహకారనగర్: నగరంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తెలంగాణ(ఎస్‌టీయూ టీఎస్) జిల్లా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ ఆధ్వర్యాన సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దొడ్డా వరప్రసాద్‌రావు, అసోసియేట్ అధ్యక్షులుగా గోపాలరావు, బానోత్ రాము, ఉపాధ్యక్షులుగా చిరంజీవి, జానకీరాణి, శ్రీకాంత్, మాలిని, జగదీష్, ప్రసాద్ జలగం, బోనాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్.కరామత్ అలీ, అదనపు ప్రధాన కార్యదర్శులుగా సీహెచ్.ఐజాక్, నరేందర్, శైలజ, కోటయ్య, మక్బూల్‌ఖాన్, ఆర్థిక కార్యదర్శిగా కె.శ్రీధర్‌బాబు, మహిళా కార్యదర్శిగా వనజకుమారి, సహాయ కార్యదర్శిగా సావిత్రిలను ఎన్నుకున్నారు. వీరి కమిటీ 2025 వరకు కొనసాగనుంది.

దివ్యాంగుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా నాగులు

ఖమ్మంఅర్బన్: జిల్లా దివ్యాంగుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రఘునాథపాలెం మండలం చెరువుకొమ్ముతండాకు చెందిన ఉపాధ్యాయుడు బానోత్ నాగులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని రోటరీనగర్ పాఠశాలలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇప్పటివరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఉన్న మందుల ఈదయ్య, తిగుళ్ల శ్రీనివాసరావులను రాష్ట్ర కమిటీలోకి వెళ్లిపోవడంతో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు నాగులు తెలిపారు. వీరిలో ప్రధాన కార్యదర్శిగా గుండెల మల్లేశ్వరరావు, కోశాధికారిగా నాచర్ల పృథ్వీ, సహాధ్యక్షుడిగా బొల్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా గోవింద కృష్ణయ్య, జె.శ్రీనివాసరావు, ఎల్లయ్య, జయరాంలు, మహిళా కార్యదర్శిగా ఉపేంద్ర, జాయింట్ సెక్రటరీలుగా గుగులోత్ మోహన్, గరిక సాంబశివరావు, బొడ్డు వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నారాయణరావుతో పాటు ఈసీ సభ్యులుగా ఐదుగురిని ఎన్నుకున్నారు. దివ్యాంగుల సమస్యల కోసం తమ వంతు పోరాటం చేస్తామని నూతన కమిటీ పేర్కొంది.

గౌరెల సహకార సొసైటీ కమిటీ ఏకగ్రీవం

నేలకొండపల్లి: మండలంలోని ఆచార్లగూడెం గౌరెల సహకార సొసైటీ అధ్యక్షుడిగా లిక్కి మద్దిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక రామాలయంలో కృష్ణ, అక్షయ గౌరెల మేకల పెంపకందారుల సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించగా.. అధ్యక్షుడితో పాటు కార్యదర్శిగా గోళ్ల అనంత్, కార్యవర్గ సభ్యులుగా మార్తి గోపి, లిక్కి హనుమంతరావు, మార్తి రామయ్య, లిక్కి విజయ, మార్తి జానకమ్మలు ఎన్నికయ్యారు.

వరి కోతలు షురూ..


సాతానిగూడెంలో వరి కోస్తున్న హార్వెస్టర్

కామేపల్లి: మండల వ్యాప్తంగా వరికోతలు ప్రారంభమయ్యాయి. ఐదు నెలలు శ్రమించిన రైతు కష్టం పంట రూపంలో చేతికందుతోంది. మరో వారం, పది రోజుల్లో వరి కోతలు ముమ్మరం కానున్నవి. ఇప్పటికే రైతులు హార్వెస్టర్లతో వరి కోత చేపట్టే పనుల్లో నిమగ్నం కాగా మండలంలో సుమారుగా 6 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి తెలిపారు.

ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేత


బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న రంజిత్ తదితరులు

ఖమ్మంరూరల్: మండలంలోని ఎం. వెంకటయపాలెంకు చెందిన తేనే నాగేశ్వరరావు ఇటీవల ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితం కావడంతో ఆదివారం నందమూరి బాలకృష్ణ సేవా సమితి ఆధ్వర్యాన రూ.3 వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో యువసేన నాయకుడు నల్లమల రంజిత్, మహేష్, రామారావు, సాయి, మధు, గోపి తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

- తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన తాత వెంకటేశ్వర్లు(78) శనివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందడంతో ఆదివారం ఎమ్మెల్సీ తాత మధుసూదన్ సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మమతా ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి తాత వెంకటబాబుతో పాటు వీరస్వామి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు రాజు, రవీందర్, బాబురావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.
- ఖమ్మం మామిళ్లగూడెం: నాటి జన సంఘ్ నుంచి నేటి బీజేపీ వరకు నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన బీజేపీ సీనియర్ నాయకుడు దామర సత్యం మృతి పార్టీకి తీరనిలోటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని సత్యం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు నరేందర్‌రావు, గుత్తా వెంకటేశ్వర్లు, ఎల్లారావు గౌడ్, సాంబశివరావు, అల్లిక అంజయ్య, సుదర్శన్, పువ్వాడ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా అమేచూర్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి తాను స్వచ్ఛందంగా వైదొలుగుతున్నట్లు పగడాల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త అసోసియేషన్ ఏర్పడ్డాక తనపై అసత్య ప్రచారాలు జరుగుతుండడంతో తానే అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలో షేక్ బేగం, చిన్న శ్రీనివాస్, కూరపాటి శ్రీను అధ్యక్షతన జరిగిన పార్టీ వన్‌టౌన్ మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా.. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. డబుల్ బెడ్రూం, దళితబంధు ఇతర సంక్షేమ పథకాలు అమలు వైఫల్యం వల్లే గత ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించారని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేదలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి ప్రజలను కదిలించి పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం సీపీఎం వన్‌టౌన్ కార్యదర్శి ఏంఏ జబ్బర్ నివేదికను ప్రవేశపెట్టారు. కాగా ఈ మహాసభల్లో పార్టీ వన్‌టౌన్ కార్యదర్శిగా షేక్ నాగులమీరాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అఫ్రోజ్ సమీనా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు ఏంఏ జబ్బార్, ఎస్.నవీన్‌రెడ్డి, తిరుపతిరావు, శ్రీనివాస్, మీరాసాహెబ్, విష్ణు వర్ధన్, బషీరుద్దీన్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న సర్కార్


సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు

ఖమ్మం మామిళ్లగూడెం: అన్ని రకాల వడ్లకు రూ.500లు బోనస్ ప్రకటిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు వడ్లు కొనకుండా కేవలం సన్నవడ్లకు మాత్రమే బోనస్ చెల్లిస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాపారావు అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన పార్టీ సభ్యత్వంతో పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి ఇప్పుడు షరతులు విధించి రైతులను మోసం చేసిందన్నారు. జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 60వేల సభ్యత్వాలు నమోదు చేశామని, ఈ నెల 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు సన్నె ఉదయ్‌ప్రతాప్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శీలం పాపారావు, వెంకటగుప్త, సుబ్రమణ్యం, సాంబశివరావు, సుదర్శన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యామ్ రాథోడ్, నున్నా రవికుమార్, అల్లిక అంజయ్య, కోటేశ్వరరావు, సంతోష్‌రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై చిన్నచూపు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఇటికాల రామకృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యార్థుల పట్ల వివక్షత చూపుతూ పెండింగ్‌లో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యారంగంపై సర్కార్ చిన్న చూపు చూస్తుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ విమర్శించారు. ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో రూ.7,650వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. ఈ సమావేశంలో జిల్లా సహాయకార్యదర్శి శివనాయక్, రాకేశ్, ప్రతాప్, సునిల్, గణేశ్, ఉమామహేశ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పొంగులేటి స్వరాజ్యం-రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 325 మంది పాల్గొనగా కిమ్స్ ఆస్పత్రి వైద్య సిబ్బందిఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి బాధ్యులు భీమ్ రెడ్డిబాబు, మార్కెటింగ్ మేనేజర్ కాకర్లమూడి అనిల్, పాక రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరిలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఆధ్వర్యాన ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బి.హరినాథ్‌బాబు మాట్లాడుతూ.. రైతులు పాడి పశువుల ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆంజనేయులు, పశువైద్యాధికారి అనంతు హరీశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

యోగా టోర్నీలో ఖమ్మం వాసి ప్రతిభ


ప్రశంసా పత్రం అందుకుంటున్న సీతారాములు

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఖమ్మానికి చెందిన కె.సీతారాములు ప్రథమస్థానంలో నిలిచాడు. 60 ఏళ్ల విభాగంలో పాల్గొన్న సీతారాములు సత్తా చాటడంతో ఆదివారం గురు దక్షిణా ఫౌండేషన్ యోగా మాస్టర్ రమేష్, తదితరులు అభినందించారు.

ప్రమాదకరంగా డీబీ..!



నిత్యం వేలాది మంది ప్రజలు తిరిగే రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఓ డీబీ(డిస్ట్రిబ్యూషన్ బోర్డ్) ప్రమాదకరంగా ఉంది. బుర్హాన్‌పురంలోని మార్కెట్ గేటు ఎదురుగా ఉండే సందులో మూలమలుపు వద్ద ఏర్పాటు చేసిన డీబీ చేతికందే ఎత్తులో ఉంది. ఈ ప్రాంతంలో ప్రైవేట్ పాఠశాలలు, బస్టాండ్‌కు వెళ్లే దారి ఉండడంతో పాటు చిన్న పిల్లలు ఆటలాడుకుంటుండడం నిత్యం జరుగుతుండగా.. దీన్ని తొలగించాలని ఆ ప్రాంతవాసులు మొరపెడుతున్నా పట్టించుకునే వారులేరు. ఎటువంటి ప్రమాదం జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

– ఖమ్మం రాపర్తినగర్